

# దహన వైభవం

శ్రీ పేరేశ్వర్

ఈ కేకలు......!

కేకలనండి, అరుపులనండి, ఆర్తనాదాలనండి. ఏదైనా మొత్తంమీద ఆశబ్దం వినపడేసరికి భూషణానికి ఎక్కడలేని కోపం, చిరాకు వచ్చినయ్. అసలే తిరిగితిరిగి అలసి సొలసి ఇంటికి వచ్చాడేమో అగ్నిలో ఆజ్యం అయింది.

పోనీ తన ఇంటికడ అతను అరుస్తున్నాడా అంటే అదీలేదు. ఎక్కడో వీధి చివరనుంచి వస్తోంది. అయినప్పటికి కూడా ఎందుకో ఈచిరాకు.

ఆముసలాడు—మాసిన కౌపీనంతో, మరోబట్టయినా లేకుండా చంకలో కర్ర నుంచుకొని కుడికాలు లేనందున మెడ్డుతూ భూషణం ఇంటికి...వచ్చా...డు.

కళ్లు జిగేలుమన్నయి ముసిలాడికి భూషణం భవన సౌందర్యం, వస్తుసామగ్రి చూచేసరికి—పెద్ద ధనవంతులాగున్నారని సంతసించాడు. ప్రాణం నిలబడవచ్చునని పొంగాడు. భగవంతుడికి వందనాలర్పించాడు.

కారణం రెండు రోజులనుంచీ కూడా ఎక్కిన గుమ్మం ఎక్కకుండా యాచించాడు. ఒక్క తల్లీ కూడా కరుణించలేదు. ఒక్క తండ్రీకూడా ఆదరించలేదు. తిండిలేక సోవడంవల్లా, తిండికోసం తిండిలేకుండా తిరగడంవల్లా......ప్రాణాలు కళ్లలో కాపురం చేస్తున్నాయ్.

ఒక్క నిమిషం ఆగుమ్మంలో చదికిలబడి చెదరినప్రాణాలు ఒక్కచోటికి చేర్చుకున్నాడు.

"ధర్మ ప్రభువులు........"

"పేదవాణ్ణి, ముసిలివాణ్ణి"

"భూషణానికి చీకాకు హెచ్చింది, కోపం ప్రబలింది.

శక్తికలిగి ఉండి, ఇష్టంవుంటే కొంచెం అభాగ్యుడికి సహాయం చెయ్యడం లేదా మానెయ్యడం. అంతేకాని చిరాకులూ, కోపాలూ, ఎందుకొస్తాయో! ధనవంతుల మనస్తత్వాలు ఇలాగే ఉంటాయి కాబోలు.

భూషణం మంచిధనవంతుడు. తనార్జించిన ధనం కాకపోయినా అతని తండ్రి

తాతలార్జించిందే! ఆధనంమీద తనప్పుడధికారం చెలాయిస్తున్నాడు.

ధనవంతుడికి, ధర్మానికి బోలెడంత కాళీస్థలముంది ధనవంతుడికి లోభానికి చాలా సన్నిహిత సంబంధం ఉంది. ధనవంతుడే కావచ్చు. తనుకూడా లక్షలార్జించవచ్చు. చాలాశ్రమతవ్మాదులకులోనై తనుయింత కష్టపడి ధనసంపాదన చేసినప్పటికీ, లోభంచేతా, అధర్మంచేతా పిల్లలుపుట్టరు. మరణ సమయంలో ఎవడో వారసుడొస్తాడు. వాడా ధనాని కధికారవుతాడు. వాడా ధనాన్ని అతిసులభంగా, అతిసాఫీగా దుర్వినియోగంచేస్తాడు.

తను బ్రతికున్నప్పుడు కడుపునిండా తిండి తినబోడు. పిల్లికి బిచ్చం బెట్టబోడు. ధనవంతుల జీవితా లిలాగే ఉంటాయి కాబోలు.

మళ్లా వీధిలోనుంచి కేక వినబడింది.

"రెండు దినాలనుంచీ తిండిలేదు మారాజా"

భూషణం తన కోపాన్నాపుకోలేకపోయాడు. ముఖం జేవురించించి, నరాలుద్రేకంతో ప్రబలాయి. శరీరం వణికింది. అప్రయత్నంగా అతని పెదవులు చలించాయ్.

"ఎవడురా అది"?

"నేను ప్రభూ!"

"ఆ బిచ్చగాణ్ణవతలకి తగిలెయ్?"

"గుమ్మంలో పడుకున్నాడు ప్రభూ! కదలలేనంటున్నాడు"

"ఇదొక దొంగవేషం! కదలకపోతే తన్నులు తింటావని చెప్పు!"

"ఎవరూ తన్నక్కరలేదటండి ఒక్క అరంగటపోతే అతనే చస్తాట్ట."

"చస్తే ఇంకోదగ్గర చావమను"

"కదలలేడట ప్రభూ!"

భూషణం చెయ్యి అప్రయత్నంగా సేవకుని దవడమీద జారింది. అయిదు వ్రేళ్లు అంటుకుపోయినయ్. భూషణానికి తెలివొచ్చింది. మనసులో నొచ్చుకున్నాడు. తన పొరపాటుని సర్దుకోబోతున్నాడు."

"ఈ విధంగా ఆ బిచ్చగాడ్ని కొట్టు వ్రేలకుండా!"

ఈ గందరగోళానికి బిచ్చగాడు లేచి నిలుచున్నాడు కర్ర నూతగాగొని తాపీగా.

సేవకునికి తన యజమానిమీద అమితమైన కోపం వచ్చింది. అతి విసురుగా అతిమెల్లిగా త్రోసేశాడు బిచ్చగాణ్ణి. మూడుసార్లు దొర్లాడు.

భూషణం కొందరు మనుష్యుల్ని పిల్చి ఆశవానికి దహనం అతివైభవంగా చేయించాడు. అందుకు తనేమట్టుకు—పూర్తిగా ధన సహాయం చేసాడు.

తెలియనిలోకం అతన్ని కొనియాడింది "భూషణంగారు ధర్మ ప్రభువులు అంటూ"

మర్నాటి వార్తా పత్రికలో అతన్ని గురించి......